క్లుప్తంగా

దుస్తుల పంపిణీ

పోరుమామిళ్ల : వంగవీటి మోహన్ రంగా జయంతి సందర్భంగా మంగళవారం పోరుమామిళ్ల పంచాయతీ రామాయపల్లె ఎస్టీ కాలనీలోని మహిళలకు చీరలు, జాకెట్లు, పురుషులకు పంచ, చొక్కాలు పంపిణీ చేశారు. వంగవీటి మోహనరంగ సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు రుద్రా శ్రీకాంత్‌రాయల్, బాలాజీల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వల్లం పిచ్చయ్య, శెట్టిం ప్రతాప్, డాక్టర్ జయరాం, సీతా సురేష్, తోట జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓకు సన్మానం

కలసపాడు : మండల విద్యాశాఖాధికారి - 1గా మంగళవారం బాధ్యతలు స్వీకరించిన పి.జె.ప్రేమ్‌సాగర్‌ను ఎస్టీయూ మండల మండలాధ్యక్షుడు ఎస్.వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్టీయూ నాయకులు ఘనంగా సన్మానించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి సి.వెంకటరెడ్డి, నాయకులు వి.మునెయ్య, కె.జె.ప్రవీణ్‌కుమార్, బి.బాలరాజు, కె.బాలచెన్నయ్య, పి.గురుప్రసాద్, సి.వీరారెడ్డి పాల్గొన్నారు.

సర్వే పక్కాగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి

బి.కోడూరు : కుష్టు వ్యాధి సర్వే పక్కాగా నిర్వహించాలని బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, ఉదయ్‌కిరణ్‌లు పేర్కొన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు, చిన్నపిల్లలు, కిశోర బాలికలకు అనీమియా లేకుండా వారికి ఐరన్, కాల్షియం మాత్రలు ఇచ్చి రక్తహీనత నుండి కాపాడాలని తెలిపారు. ఈ సందర్భంగా రిటైర్డ్ అయిన ఆశావర్కర్ రామలక్షుమ్మను వైద్యాధికారులు, సిబ్బంది పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

వృద్ధులకు అన్నదానం

కాశినాయన : వంగవీటి మోహనరంగా జయంతిని పురస్కరించుకుని మంగళవారం అమగంపల్లెలోని బాలమ్మ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ కార్తీక్‌కుమార్, డాక్టర్ జయరాములు, పోరుమామిళ్ల సర్పంచ్ సుధాకర్, రచయిత బొల్లు రామ్మోహన్, వైస్ ఎంపీపీ ప్రసాద్, రిటైర్డ్ ఎంఈఓ బాలఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడికి ఘన నివాళి

కాశినాయన : మండలంలోని ఓబుళాపురం గ్రామం సగిలేరు ఒడ్డున ఉన్న వివేకానంద సేవాశ్రమంలో మంగళవారం స్వామి వివేకానంద వర్ధంతిని నిర్వహించారు. వివేకానందునికి ఆశ్రమ నిర్వాహకులు ముత్తుముల రామతులసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆశ్రయం లేని అనాథలకు సేవ చేయడం వివేకానందుని అనుగ్రహమే అన్నారు. వివేకానందుని స్ఫూర్తితోనే సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో అనాథ వృద్ధులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు అవగాహన

దువ్వూరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డాక్టర్ సమీర ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలకు ఆరు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి రక్తహీనత నివారణ, యుక్త వయసులో బాలికల్లో వచ్చే శారీరక మార్పులు, ఐఎఫ్ఏ మాత్రల ఉపయోగాలు, కుటుంబ నియంత్రణ, అంటు వ్యాధులు నివారణ, గర్భనిర్ధారణ కిట్ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేష్‌బాబు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

మైదుకూరు : బద్వేలు రోడ్డులో ఉన్న ఎస్ఎల్ఆర్ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో డాక్టర్లు రామ అనిల్ కుమార్‌రెడ్డి, క్రాంతికుమార్ 150 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, టూడీ ఎకో, అవసరమైన వారికి లిపిడ్ ప్రొఫైల్, హెచ్‌బీఏ1సీ పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు అందించినట్లు తెలిపారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

పోరుమామిళ్ల : దేశానికి స్వాతంత్య్రం వచ్చి ఏడు దశాబ్దాలు గడచినా ఆటో డ్రైవర్ల జీవనంలో ఎలాంటి మార్పు రాలేదని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి మస్తాన్ సీపీఐ మండల కార్యదర్శి రవి అన్నారు. మంగళవారం జరిగిన ఆటో డ్రైవర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్, రవాణా శాఖ అధికారులు ఆటో డ్రైవర్లకు ఇస్తున్న ఈ-చలానాలు కక్ష సాధింపుగా ఉన్నాయన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకరావాలన్నారు. జీఓ నెం.21ని రద్దు చేయాలన్నారు. సమావేశంలో అబ్దుల్‌ఖాదర్, ఈశ్వరయ్య, నాయకులు ప్రభాకర్, అన్వర్, గురప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పేదల గౌరవాన్ని పెంచడమే ప్రభుత్వ లక్ష్యం

ప్రొద్దుటూరు : పేదలను ఓట్ల కోసం కాకుండా మనుషులుగా చూస్తూ వారికి సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చి వారి గౌరవాన్ని పెంచడమే జగన్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 6, 7, 8 వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాల ద్వారా పేదలకు నేరుగా వారి ఖాతాలకు జమ చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకునేలా పాలన సాగిస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాల ద్వారా 6వ వార్డులో రూ.12 కోట్లు, 7, 8 వార్డుల్లో రూ.33 కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమ చేశారన్నారు. సీఎం జగన్ విద్యకు పెద్ద పీట వేస్తూ అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, విద్యాకానుక, వసతి దీవెన లాంటి పథకాలతో విద్యార్థులు చదువుకునేలా ప్రోత్సహిస్తున్నారన్నారు. విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అభ్యసించే విధంగా నాడు - నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. సాంకేతిక కారణాల వల్ల అర్హులైన వారికి సంక్షేమ పథకాలు పొందలేని వారికి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పరిష్కారం చేయడం అభినందనీయమన్నారు. ప్రజలకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 6వ వార్డులో 527, 7, 8 వార్డుల్లో 308 మందికి అవసరమైన సర్టిఫికెట్లను అందించామన్నారు. ఇంకా ప్రజలకు ఏమైనా సమస్యలుంటే వలంటీర్ దృష్టికి తీసుకొస్తే పరిష్కారం చూపిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు జరిగిన మేలును గుర్తించి, తిరిగి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, కౌన్సిలర్లు వై.జయంతి, గుర్రం లావణ్య, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జిలు పంగ సురేష్‌కుమార్, గుర్రం ప్రకాష్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు, అధికార ప్రతినిధి పగిడాల దస్తగిరి, తొగటవీరక్షత్రియ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు : సర్టిఫికెట్ అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



బ్రహ్మంగారిమఠం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రొద్దుటూరు : అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ తెలిపారు. మండలంలోని సోములవారిపల్లె పంచాయతీలోని నాలుగు గ్రామ సచివాలయాలకు సంబంధించి మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న వెంటనే 11 సర్టిఫికెట్లను ఉచితంగా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాలకు అర్హత పొందేందుకు సర్టిఫికెట్లు ఎంతో అవసరమని, అందుకే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సర్టిఫికెట్లు ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, పంచాయతీ సెక్రటరీ హరినాథ్, ఎంఎల్ఓ రియాజ్, ఎంపీటీసీలు గోటూరు బాల గురమ్మ వెంకటేష్, పల్లా లక్ష్మీదేవి, బాషా, సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

నిరుపేదలను గుర్తించడమే జగనన్న సురక్ష ధ్యేయం

బ్రహ్మంగారిమఠం : ప్రభుత్వం నిరుపేదలకు అందిస్తున్న పథకాలు ఇంకా ఎవరికైనా అందకపోతే వారిని గుర్తించడమే జగనన్న సురక్ష కార్యక్రమం అని ఎమ్మెల్యే ఎస్ .రఘురామిరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని ముడుమాల గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో ప్రజలు ఆ ప్రభుత్వాని తిరస్కరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని హామీలను ఇచ్చారన్నారు. ముడుమాల పంచాయతీలో రూ. 10 కోట్లు వివిధ రూపాలలో నిరుపేదలకు లబ్ధిచేకూరిందన్నారు. అనంతరం 190 సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఎం రామగోవిందరెడ్డి, ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు నేలటూరు సుబ్బిరెడ్డి, డీటీ జాన్సన్, గ్రామ సచివాలయాల కన్వీనర్ రాజానాయుడు, ఎంపీటీసీ శీలం పెంచలమ్మ భర్త వైఎస్ఆర్ సీపీ నాయకుడు శీలం రామగురివిరెడ్డి, నరసింహ్మలు, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

దువ్వూరు : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని చింతకుంట సచివాలయం-2 మీర్జఖాన్‌పల్లెలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ 11 రకాల సేవలను ఉచితంగా ప్రజలకు అందిస్తామని, వలంటీర్లు వారం ముందే ఇంటింటా తిరిగి సమస్యలను నమోదు చేయాలని తెలిపారు. అర్హులు ఎవరైనా మిగిలి ఉంటే వారికి ప్రభుత్వ సేవలు అందించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. కౌలు రైతులు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న 110 మందికి సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోగటం వీరారెడ్డి, ఎంపీటీసీలు బొమ్మిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఖాదర్‌బాషా, మండల కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాషా, లింగేశ్వరరెడ్డి, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం

చాపాడు : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని.. ప్రతి గ్రామంలో జరిగే గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల అధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య తెలిపారు. మండలంలోని బద్రిపల్లె గ్రామ సచివాలయం వద్ద మంగళవారం జగనన్న సురక్ష గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన వివిధ రకాలైన ధృవీకరణ పత్రాలు అధికార యంత్రాంగం పంపిణీ చేస్తోందన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం దొరుకుతోందన్నారు. తహసీల్దారు సుభానీ మాట్లాడుతూ బద్రిపల్లె గ్రామ సభలో 276 మంది లబ్ధిదారులకు వివిధ ధృవీకరణ పత్రాలు అందజేశామన్నారు. అర్హత కలిగి సంక్షేమ పథకాలు అందని వారుంటే తెలియజేయాలన్నారు. అనంతరం గ్రామ సభలో ధృవీకరణ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ రాధాకృష్ణవేణి, ఏఓ మ్యాగీ, పంచాయతీ కార్యదర్శి సురేష్, గ్రామ సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు రామసుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, సచివాలయ కన్వీనర్ ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్ : పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని తొట్టిగారిపల్లె సచివాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పథకాలు అందరికీ అందజేయాలని ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చింతపల్లె లక్షుమ్మ, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ యద్దారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తా లక్ష్మీదేవి, రూరల్ నాయకులు పోలిరెడ్డి, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జిలు, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోపవరం : ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలందిచాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిందే జగనన్న సురక్ష కార్యక్రమం అని తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఎంపీడీఓ హరినారాయణలు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బ్రాహ్మణపల్లె సచివాలయంలో సర్పంచ్ కె.లక్ష్మీదేవి అధ్యక్షతన జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించి లబ్ధిదారులకు ఉచితంగా ధృవీకరణ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, సచివాలయ కన్వీనర్ పుల్లయ్య, ఈఓపీఆర్డీ హసీనా, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చేందుకు, ప్రజలకు మరింత మేలు చేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతున్నదని జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రంగసముద్రం 2 వ సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న ప్రతి లబ్ధిదారునికి పరిష్కారం లభించేలా జగనన్న సురక్ష ఉపయోగపడుతుందన్నారు. ఇంతవరకు 245 దరఖాస్తులు వచ్చాయని, స్క్రూటీని అనంతరం లబ్ధిదారులందరికీ ధృవీకరణ పత్రాలు ఇచ్చి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి కొందరికి సర్టిఫికెట్లు అందచేశారు.

కాశినాయన : కార్యాలయాల చుట్టూ తిరగకుండా పైసా ఖర్చు లేకుండా అప్పటికప్పుడే సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టిందని జెడ్పీటీసీ సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ పోలమ్మలు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గంగనపల్లె గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ డాక్టర్ మైథిలి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వారం రోజులుగా వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్ళి వారికి కావాల్సిన సర్టిఫికెట్లకు సంబంధించి వివరాలు సేకరించారు. మంగళవారం సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు రామచంద్రుడు, ఈఓపీఆర్డీ ముజఫర్ రహీమ్, మండల ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్యఆచారి, స్థానిక సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.



బద్వేల్ అర్బన్: పత్రాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్



ప్రొద్దుటూరు: మాట్లాడుతున్న ఎంపీపీ శేఖర్ యాదవ్



దువ్వూరు: సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంపీడీఓ



చాపాడు: పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ



గోపవరం: బ్రాహ్మణపల్లెలోని కార్యక్రమంలో..

సేవాభావంతో పని చేయాలి

ప్రొద్దుటూరు క్రైం : రోగులకు సేవా భావంతో వైద్య సేవలను అందించాలని డాక్టర్ హనీఫ్‌బాబా తెలిపారు. మండలంలోని కామనూరు పీహెచ్‌సీలో మంగళవారం ఆశా కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ల సీహెచ్ఓలు ప్రజలను చైతన్య పరుస్తూ వైద్య సేవలను అందించడంలో ముందుండాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో గర్భవతులు, బాలింతలు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించి మంచి సేవలను అందించాలని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు జరిగేలా చూడటంతోపాటు గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, పిల్లల్లో రక్తహీనత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

ఆరోగ్యవంతమైన సమాజం కోసం అందరూ కృషి చేయాలని కోరారు. అనంతరం డెంగీ నివారణ మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ కృష్ణమ్మ, హెచ్ఈ శోభారాణి, సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, చంద్రకళ, సీహెచ్ఓలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్టురహిత సమాజం కోసం కృషి చేయాలి

చాపాడు : కుష్టు రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వల్లీ కోరారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం ఆశా డే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ఆశా, ఏఎన్ఎం, సీహెచ్ఓలు కుష్టు వ్యాధి గుర్తింపు సర్వేను పూర్తి చేయాలన్నారు. అనుమానిత, స్పర్శలేని, రాగి రంగు మచ్చలు ఉన్న ప్రతి ఒక్కరినీ గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపాలన్నారు. ఇదే క్రమంలో ఏఎన్సీ రిజిస్ట్రేషన్ పక్కాగా 12 వారాల లోపల నమోదు చేయాలన్నారు. అన్ని కార్యక్రమాలపై తరచూ రివ్యూ నిర్వహించాలని వైద్యాధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్, వైద్యులు కావ్య



మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వల్లి

మాధురి, ఓబులేసు, సీహెచ్ఓ మహదేవ యాదవ్, సూపర్‌వైజర్ సరస్వతి, ఎఫ్‌పీసీ పర్యవేక్షకులు భాస్కర్, నారాయణరెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పనిముట్లు పంపిణీ

బ్రహ్మంగారిమఠం : మండలంలోని ముడుమాల, పలుగురాళ్ళపల్లె గ్రామ పంచాయతీలలో వాటర్‌షెడ్ పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి చేతులమీదుగా పనిముట్లు పంపిణీ చేశారు. రెండు పంచాయతీలలో రూ.70 లక్షలు విలువచేసే పనిముట్లను మైక్రోవాటర్‌షెడ్ పథకం ద్వారా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాటర్‌షెడ్ అడిషనల్ పీడీ నాగరత్నమ్మ, ముడుమాల, పలుగురాళ్ళపల్లె వాటర్‌షెడ్ల చైర్మన్లు శీలం సిద్దారెడ్డి, రామకృష్ణారెడ్డిలు, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఎం .రామగోవిందరెడ్డి, వైస్సార్‌సీపీ మండల కన్వీనర్ మేకల రత్నకుమార్‌యాదవ్, పలుగురాళ్ళపల్లె ఎంపీటీసీ లలితమ్మ, సర్పంచ్ సోమిరెడ్డిపల్లె మార్తమ్మ,



ముడుమాలలో రైతులకు పనిముట్లను అందిస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

ఉపసర్పంచ్ బసిరెడ్డి దుగ్గిరెడ్డి, నాయకులు వాటర్‌షెడ్ ఏఓ వేణుగోపాల్‌రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు సుబ్బిరెడ్డి రైతులు పాల్గొన్నారు.

పరిశోధన కేంద్రంపై సానుకూల స్పందన

మైదుకూరు : మైదుకూరులో కేపీ ఉల్లి పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు కృషి చేయాలని కోరగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు బీజేపీ మాజీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బీపీ ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు ఎంపీకి ధన్యావాదాలు తెలుపుతున్నానని ఆయన పేర్కొన్నారు. కేంద్రం అమలు చేయనున్న ''ఒక జిల్లా - ఒక ఉత్పత్తి'' కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ జిల్లా నుంచి మైదుకూరు కేంద్రంగా సాగు అవుతున్న ఎగుమతి రకం పంట కేపీ ఉల్లిని అధికారులు ప్రాథమికంగా గుర్తించిన నేపథ్యంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి ఉల్లి పరిశోధనా కేంద్రం ఏర్పాటుపై విజ్ఞప్తి చేసినట్టు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. పంటను ఎగుమతి చేసేందుకు రైతులను ప్రోత్సహించాలంటే మైదుకూరులో పరిశోధనా కేంద్రం అవసరమని ఎంపీకి వివరించినట్టు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ వైపుగా పయనించాలని మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య పేర్కొన్నారు. స్థానిక పద్మశాలీయ కల్యాణ మండపంలో మంగళవారం పద్మశాలీయ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదివే విద్యార్థులకు 11వ వార్షిక ఉచిత నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను అందించడం అభినందనీయమని అభ్యుదయ సంఘం సేవలను కొనియాడారు. పద్మశాలి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఉచితంగా నోటు పుస్తకాలు, విద్యాసామగ్రి అందచేయడం అభినందనీయమన్నారు. పద్మశాలీయ అభ్యుదయ సంఘం అధ్యక్షుడు వద్ది నరసింహులు



నోటు పుస్తకాలు అందజేస్తున్న కమిషనర్ వెంకట రమణయ్య, జింకా విజయలక్ష్మి

మాట్లాడుతూ పేద విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 11 ఏళ్లుగా పదవ తరగతి చదువుతున్న మున్సిపల్, ఎయిడెడ్, జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, ఎగ్జామ్ ప్యాడ్, జామెంట్రీ బాక్స్‌లను దాతల సహకారంతో అందిస్తున్నామన్నారు. అలాగే సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు, చలివేంద్రాల ఏర్పాటు, పేదలకు దుప్పట్లు పంపిణీ తదితర సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని 1800 మంది 10వ తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి మూడు నోటుపుస్తకాలు, జామెంట్రీ బాక్స్, ఎగ్జామ్ ప్యాడ్, 150 మంది ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు 6 నోటు పుస్తకాలను అందించారు. రూ.5 లక్షలు విలువ చేసే 6500 నోటు పుస్తకాలు, 1800 జామెంట్రీ బాక్స్‌లు, ప్యాడ్‌లను అందించారు. కార్యక్రమంలో డోన్ ఉపవిద్యాశాఖాధికారి క్రిష్టఫర్, ఎంఈఓలు సావిత్రమ్మ, శోభారాణి, అఖిల భారత పద్మశాలీయ సంఘం సెక్రటరీ నందం లక్ష్మణ కుమార్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నా వెంకట కృష్ణ, అభ్యుదయ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌లు చెన్నా చంద్రబాబు, సాధు అశోక్, జనరల్ సెక్రటరీ వద్ది నాగరాజు, ట్రెజరర్ అవ్వారు శ్రీనివాసులు, భోగా ఆనంద్, సంజీవ్, జింకా శ్రీనివాసులు, ఆడిటర్లు సాధు గోపాలకృష్ణ, పోలంకి వరదరాజులు, రచయిత జింకా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రంగా జయంతి

బద్వేలు అర్బన్ : మాజీ ఎమ్మెల్యే, దివంగత వంగవీటి మోహనరంగా 76వ జయంతి వేడుకలను మంగళవారం బలిజసేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు రోడ్డులోని శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌లో వంగవీటి రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బలిజ సేవా సంఘం నాయకులు నానబాల వెంకటేశ్వర్లు, పందుగాయల రమణయ్య, వెంకటసుబ్బయ్య, పి.వెంకటయ్య, కొంకుల రామకృష్ణ, డాక్టర్ హరికృష్ణ, ఎస్.వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి తొలగింపునకు చర్యలు

చాపాడు : మండలంలోని నెర్రవాడ గ్రామంలో రామాలయం సమీపంలో వర్షం పడితే రోజుల తరబడి నీటి నిల్వ ఉండే ప్రాంతాన్ని మంగళవారం మండల అధ్యక్షుడు లక్షుమయ్య పరిశీలించి సమస్య పరిష్కారంపై గ్రామస్థులో చర్చించారు. నీటిని బయటికి తరలించే మార్గాన్ని గుర్తించి త్వరలోనే కాలువ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీపీ గ్రామ ప్రజలకు తెలిపారు.

నిర్వాసితులకు విరాళం సేకరణ

ప్రొద్దుటూరు : పోలవరం డ్యాం నిర్మాణం వల్ల సర్వం కోల్పోయిన బాధితుల పునరావాసం కోసం సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో పోలవరం నుంచి విజయవాడకు నిర్వహిస్తున్న పాదయాత్ర సంఘీభావానికి ప్రొద్దుటూరు మున్సిపల్ కార్మికులు విరాళం సేకరించారు. మున్సిపాలిటీ పరిధిలోని మూడు డివిజన్ల కార్మికుల నుంచి సేకరించిన రూ.7,120లను రాష్ట్ర కమిటీకి పంపించామని మున్సిపల్ కార్మికుల యూనియన్ కార్యదర్శి సాల్మన్ మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో



విరాళం సేకరిస్తున్న మున్సిపల్ కార్మికులు

యూనియన్ నాయకులు విజయకుమార్, రాఘవ, రవణమ్మ, రవికుమార్, రవి, సుధాకర్, గుర్రమ్మ, ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత యాంటీ రాబీస్ టీకాలు

ప్రొద్దుటూరు : స్థానిక పశువైద్య కళాశాలలో గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 3 నెలలు దాటిన కుక్క పిల్లలకు ఉచితంగా యాంటి రాబీస్ టీకాలు వేయనున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.వైకుంఠరావు ఒక ప్రకటనలో తెలిపారు. పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను జునోటిక్ వ్యాధులంటారని, కుక్క కాటుతో రేబిస్ వ్యాధి సంసక్రమిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ పెంపుడు కుక్కలకు యాంటీ రాబీస్ టీకాలు వేయించుకోవాలని సూచించారు. వివరాలకు డాక్టర్ కె.రాంబాబు నంబర్ 9866953132కు సంప్రదించాలన్నారు.

బాకీ డబ్బులు ఇవ్వలేదని వ్యక్తి ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం : బాకీ డబ్బులు ఇవ్వనని చెప్పినందుకు చాపాడు మండలం చెంచుపల్లెకు చెందిన నాగేశ్వర్‌రెడ్డి(35) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ పోలీసుల వివరాలమేరకు.. నాగేశ్వర్‌రెడ్డి సమీప బంధువైన గోవిందరెడ్డి ప్రొద్దుటూరులోని వైఎంఆర్‌కాలనీలో నివాసముంటున్నాడు. అతనికి ఆరేళ్లక్రితం నాగేశ్వర్‌రెడ్డి రూ.14 లక్షలు అప్పుగా ఇచ్చాడు. డబ్బు ఇవ్వమని అనేక సార్లు అడిగినా గోవిందరెడ్డి కాలయాపన చేస్తూ వచ్చాడు. ఇటీవల డబ్బుఇవ్వాల్సిందేనని నాగేశ్వర్‌రెడ్డి గట్టిగా అడుగగా డబ్బు ఇవ్వనని కావాలంటే కోర్టులో వేసుకో అని గోవిందరెడ్డి చెప్పాడు. దీంతో మనస్తాపం చెందిన నాగేశ్వర్‌రెడ్డి సోమవారం సాయంత్రం గోవిందరెడ్డి దుకాణం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వేంటనే అతన్ని చికిత్సనిమిత్తం కర్నూలుకు తీసుకుని వెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు టూటౌన్ సీఐ ఇబ్రహీం తెలిపారు.

